సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



పోడు పట్టాలు ఇవ్వలేదని..

పోడు పట్టాలు ఇవ్వలేదంటూ లక్ష్మీదేవిపల్లి, చండ్రుగొండ, జూలూరుపాడు మండలాల్లో కాసేపు ఎన్నికలను బహిష్కరించారు. 8లో



ఈ.బయ్యారంలో ఉద్రిక్తత

పినపాక మండలం ఈ.బయ్యారం పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ – బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 19°

జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలన

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఇక అశ్వారావుపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పరిశీలకుడిగా నియమితులైన వివేశ్‌కుమార్ గురువారం కలెక్టరేట్‌కు రాగా, ఆయనకు మొక్క అందజేసి స్వాగతం పలికారు.

వనమాను అడ్డుకున్న గ్రామస్తులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికులు ఆయన కారుకు ఎదురుగా నిల్చుని వనమా తమ గ్రామానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, తమ గ్రామానికి రావద్దని అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులకు – ఎమ్మెల్యేకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా, ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

పాల్వంచ: పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల గురువారం సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ముగింపు అనంతరం ఐదు నియోజకవర్గాల నుంచి వచ్చిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు తెలిపారు. సీసీ టీవీల ఏర్పాటుతో పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఉంటుందని, అపరిచిత వ్యక్తులను పరిసరాల్లో అనుమతించబోమని వివరించారు. ఈనెల 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

సింగరేణి ఎన్నికల ప్రక్రియ వేగవంతం

- డిసెంబర్ 27న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- 4వ తేదీన కార్మిక సంఘాలతో డీవైసీఎల్పీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యాన సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధం కాగా... కార్యాచరణ రూపొందించేందుకు 14 కార్మిక సంఘాల నాయకులతో 4వ తేదీన డీవైసీఎల్పీ డి.శ్రీనివాసులు సమావేశం కానున్నారు. సింగరేణిలో మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని అక్టోబర్ 11న హైకోర్టు ఆదేశించింది. దీంతో సింగరేణి యాజమాన్యానికి లేఖ పంపించగా.. యాజమాన్యం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఉద్యోగులను కేటాయించలేమని కలెక్టర్లు చెప్పినట్లు హైకోర్టుకు వెల్లడించింది. దీంతో అసెంబ్లీ పోలింగ్ ముగిశాక సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించగా, డిసెంబర్ 4న జరిగే సమావేశానికి యూనియన్ ప్రతినిధులు హాజరుకావాలని డీవైసీఎల్పీ లేఖలు పంపించింది. అనంతరం 27న ఎన్నికలు నిర్వహించే అవకాశముంది.

పోలింగ్ ప్రశాంతం





చుంచుపల్లి తండా పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం వివరాలు		
నియోజకవర్గం	2018	2023
పినపాక	90.05	79.55
ఇల్లెందు	89.06	79.32
కొత్తగూడెం	90.05	76.56
అశ్వారావుపేట	97.08	80.13
భద్రాచలం	87.03	78.36
మొత్తం	90.65	78.66

గతంతో పోలిస్తే తగ్గిన ఓట్ల నమోదు

- జిల్లా వ్యాప్తంగా 78.66 శాతానికే పరిమితం
- కొన్నిచోట్ల బీఆర్‌ఎస్ – కాంగ్రెస్ మధ్య ఘర్షణ
- పినపాకలో భద్రతా దళాల లాఠీచార్జ్



ఇల్లెందులో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో జిల్లా వాసులు ఈసారి వెనుకంజ వేశారు. గత ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించిన ఓటర్లు ఈసారి ఆ తరహా చైతన్యం కనబర్చలేదు. దీంతో గతంతో పోలిస్తే ఈసారి ఓట్ల శాతం గణనీయంగా తగ్గింది.

నెమ్మదిగా ప్రారంభమై..

ఉదయం 7 గంటలకే జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అంతకు గంట ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అశ్వారావుపేట మినహా మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో మధ్యాహ్నం వరకు పోలింగ్ మందకొడిగానే సాగింది. భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓటర్లు పోలింగ్‌స్టేషన్లకు బారులుదీరారు. కొత్తగూడెంలో శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రానికైతే బహిరంగ సభకు తరలివచ్చినట్టుగా ఒక్కసారిగా ఓటర్లు పోటెత్తారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్‌కు అధికారులు అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత పోలింగ్ స్టేషన్ల గేట్లు మూసేశారు. అయితే అప్పటికే కేంద్రాలకు చేరుకున్న వారికి మాత్రం ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో జిల్లాలోని పలు కేంద్రాల్లో రాత్రి 7 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది.

అశ్వారావుపేటలో అత్యధికం..

పూర్తిగా గ్రామీణ నియోజవకర్గమైన అశ్వారావుపేటలో ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో ఓటర్లు ఉత్సాహం చూపించారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల ఎదుట బారులుదీరి నిల్చున్నారు. దీంతో 11 గంటల వరకే 30 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ పోలింగ్ ముగిసే సమయానికి 71.84 శాతం పోలింగ్ జరిగింది. దీంతో జిల్లాలో ప్రథమ స్థానంలో 'పేట' నిలిచింది. ఇక పట్టణ, పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెంలో మందకొడిగా పోలింగ్ సాగింది. మరో గంటలో పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు కూడా ఈ నియోజకవర్గంలో 49.70 శాతం మేర మాత్రమే నమోదైంది. ఆ తర్వాత కొంత పుంజుకున్నా.. 64.73 శాతానికే పరిమితమైంది. ఇల్లెందులో పరిస్థితి కొంత మెరుగై 65.19 శాతం మేర ఓట్లు నమోదయ్యాయి.

బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్

పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద లాఠీచార్జ్ జరిగింది. సాయంత్రం 3:15 గంటల సమయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పోలింగ్ కేంద్రం పరిశీలనకు వచ్చారు. అయితే అక్కడ భద్రతా విధుల్లో ఉన్న ఎస్సై సతీష్ పోలింగ్ కేంద్రంలోకి రేగాను అనుమతించలేదు. దీంతో పోటీ చేసే అభ్యర్థిని పోలింగ్ కేంద్రంలోకి ఎందుకు అనుమతించరంటూ రేగా కాంతారావు ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులు, రేగాకు మధ్య వాదన జరిగింది. అదే సమయంలో అక్కడున్న కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేను పోలింగ్ బూత్‌లోకి వెళ్లనీయకుండా అడ్డుగిలారు. దీనికి ప్రతిగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు స్పందించారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసుల లాఠీచార్జ్..

భద్రతా బలగాల రక్షణ మధ్య రేగా కాంతారావు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. వెంటనే పోలింగ్ కేంద్రంలోకి దూరేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రయత్నించడంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వల్ప లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. అనంతరం పోలింగ్ కేంద్రం నుంచి వచ్చిన కాంతారావు జరిగిన ఘటనపై ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అభ్యర్థిగా తనకు ఉండే హక్కులను పోలీసులు అడ్డుకున్నారని, పోలింగ్ కేంద్రం దగ్గర తనకు సరైన రక్షణ కల్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో రేగా కాంతారావు వాహనంపై రాళ్ల దాడి కూడా జరిగింది. అయితే ఆ సమయంలో ఆయన వాహనంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

భారీగా తగ్గిన పోలింగ్..

అర్బన్ ఏరియాలతో పోలిస్తే సాధారణంగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్‌లో పాల్గొనేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తుంటారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ట్రెండ్ కనిపించింది. ఆ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 81.60 శాతం పోలింగ్ జరగగా, ఈసారి 78.66 శాతానికే పరిమితమైంది. అంటే దాదాపు 15 శాతం మేరకు ఓట్లు తగ్గాయి. ఓటింగ్ పెంచేందుకు జిల్లా అధికారులు ప్రయత్నించినా ఆ ప్రభావం అంతగా కనిపించలేదు. ప్రధాన పార్టీలు సైతం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో పెద్దగా శ్రద్ధ పెట్టలేదని తేలిపోయింది. చివరి నిమిషంలో మేల్కొన్న పార్టీలు 'గోల్డెన్ అవర్స్'లో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టడంతో మధ్యాహ్నం తర్వాత కొంతమేరకైనా పోలింగ్ ఊపందుకుంది.



పాల్వంచ మండలం సోములగూడెం పోలింగ్ కేంద్రంలో క్యూ కట్టిన ఓటర్లు

ఓటేసిన కలెక్టర్, ఎస్పీ



పాల్వంచలో ఓటు వేసిన కలెక్టర్ ప్రియాంక ఆల



ఓటు వేసిన ఎస్పీ వినీత్ దంపతులు

పాల్వంచ/కొత్తగూడెంటౌన్ : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పాల్వంచ ఎన్‌ఎండీసీ కర్మాగారం పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. గురువారం ఆమె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అక్కడే ఓటేశారు. ఎస్పీ డాక్టర్ వినీత్ సతీమణి ప్రీతితో కలిసి కొత్తగూడెం త్రీ ఇంక్లైన్ ప్రాథమిక పాఠశాల కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ



మణుగూరు మండలంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

బూర్గంపాడు/పాల్వంచ/మణుగూరురూరల్ : బూర్గంపాడు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును, ఎన్నికల నిర్వహణను ఎస్పీ డాక్టర్ వినీత్ గురువారం పరిశీలించారు. బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక కేంద్రాల వద్ద బందోబస్తులో ఉన్న ఇబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. పాల్వంచ పట్టణంలోని బొల్లేరుగూడెం, గట్టాయిగూడెంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సైతం ఎస్పీ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మణుగూరు మండలంలోని పలు కేంద్రాల్లోనూ ఎస్పీ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్, సీఆర్‌పిఎఫ్ బలగాల భద్రత, రక్షణ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట మణుగూరు సీఐ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు కోసం లండన్ నుంచి..



అరవింద్ కుమార్

అశ్వారావుపేట : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. అలాంటి ఓటుహక్కును వినియోగించుకునేందుకు మండల కేంద్రంలోని బీఎస్‌ఆర్ నగర్‌కు చెందిన ముళ్లపూడి అరవింద్ కుమార్ లండన్ నుంచి వచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అరవింద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం ఉద్యోగరీత్యా లండన్‌కు వెళ్లాడు. కాగా, గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా లండన్ నుంచి అశ్వారావుపేట చేరుకున్నాడు.

జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం



క్రీడాకారుడిని అభినందిస్తున్న పోటీల నిర్వాహకులు

భద్రాచలంటౌన్: జాతీయ స్థాయిలో బెంచ్ ప్రెస్ పోటీల్లో భద్రాచలానికి చెందిన క్రీడాకారుడు బంగారు పతకం సాధించాడు. నవంబర్ 24 నుంచి 28 వరకు బెంగళూరులో జరిగిన పోటీల్లో పట్టణానికి చెందిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు మహమ్మద్ అబ్బాస్ ప్రథమ స్థానంలో నిలిచాడు. మరో క్రీడాకారుడు మహంతి వెంకటకృష్ణ ఆరో స్థానంలో నిలిచి బహుమతి సాధించాడు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, క్రీడాభిమానులు గాదె మాధవ రెడ్డి, ప్రభాకర్ తదితరులు అభినందించారు.

నోటు ఇస్తేనే ఓటు..

- డబ్బులు ఇవ్వడం లేదంటూ పలుచోట్ల ఆందోళన
- అభ్యర్థుల అనుచరులపై ఆగ్రహావేశాలు
- ఓటు వేయబోమంటూ చాలాసేపు అలక



భద్రాచలంలో డబ్బులు ఇవ్వలేదంటూ నినాదాలు చేస్తున్న మహిళలు



ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/మణుగూరురూరల్/భద్రాచలం/పాల్వంచ/సుజాతనగర్ : ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీలు ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు పోటీపడ్డాయి. అయితే కొన్నిచోట్ల బుధవారం అర్ధరాత్రి వరకు డబ్బులు పంపిణీ చేయగా, తమకు అందలేదంటూ పలువురు ఓటర్లు అభ్యర్థుల అనుచరులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీంతో గురువారం తెల్లవారుజామున అక్కడక్కడా డబ్బు పంపిణీ చేసినా.. చాలా మంది తమకు ఇవ్వలేదంటూ ఓట్లు వేయబోమని నిరసన తెలిపారు. ఎట్టకేలకు మధ్యాహ్నానికి పంపిణీ ప్రక్రియ పుంజుకోగా ఓటింగ్ శాతం కూడా పెరిగింది. కాగా, పలు పార్టీల నాయకులే తమ పబ్బం గడుపుకునేందుకు ప్రజలకు ఓటుకు నోటు ఇవ్వడం అలవాటు చేశారని, ఈ పరిస్థితుల్లో మార్పు తేకుంటే భవిష్యత్‌లో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజుపేట గ్రామస్తుల ఆందోళన

మణుగూరురూరల్ : ఓటుకు నోటు ఇవ్వలేదంటూ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల నాయకులు డబ్బు పంపిణీ చేయగా.. రాజుపేట గ్రామంలో ఓ పార్టీకి చెందిన వారు తమకే ఓటేయాలంటూ ప్రచారం చేశారు. అయితే డబ్బు ఇవ్వకుంటే ఓటెలా వేస్తామంటూ స్థానికులు వారితో వాగ్వాదానికి దిగడంతో ఆ పార్టీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తెల్లవారుజాము వరకు తాయిలాలు

భద్రాచలం: ఓటింగ్ సమయం సమీపించే వరకూ భద్రాచలం నియోజకవర్గంలో తాయిలాల పండుగ నడిచింది. భద్రాచలంతో పాటు దుమ్ముగూడెం మండలంలోని పలు కాలనీల్లో బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 5 గంటల వరకు రెండు ప్రధాన పార్టీలకు చెందిన వారు ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. అయితే అధికార పార్టీ వారు ఓటుకు రూ.1000 చొప్పున పంచడంతో ఆయా కాలనీల్లో డబ్బు అందని వారు ఆశగా ఎదురుచూశారు. మరికొంత మందికి ఆ డబ్బు అందకపోవడంతో నిరాశ చెందారు. ఏఎంసీ కాలనీకి చెందిన మహిళలు డబ్బులు ఇవ్వలేదంటూ అధికార పార్టీ కార్యకర్తలను నిలదీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

పాల్వంచలో..

పాల్వంచ : తమకు డబ్బులు ఇవ్వలేదంటూ పాల్వంచలోని పలు ప్రాంతాల్లో ఓటర్లు ఆందోళన చేశారు. పలు కాలనీలకు చెందిన వారు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటికి చేరుకుని తాయిలాలు ఇవ్వాలని కోరారు. మంచికంటి నగర్‌లో కొందరు అభ్యర్థుల అనుచరులతో వాగ్వాదానికి దిగారు. పాలకోయతండాలో డబ్బు ఇవ్వకుంటే ఓటేసేది లేదని కొందరు పోలింగ్ కేంద్రం నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. సుజాతనగర్ మండలం సర్వారంలో ఓ అభ్యర్థి డబ్బులివ్వలేదనే కోపంతో సుమారు వెయ్యి మంది ఓటు వేసేందుకు సాయంత్రం 3 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి రాలేదు. విషయం తెలుసుకున్న అనుచరులు ఓటర్లకు డబ్బులివ్వడంతో ఒక్కసారిగా పోలింగ్ కేంద్రానికి తరలిరావడంతో తోపులాట జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కేంద్రాల పరిధిలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

అంతులేని మహమ్మారి

- ఖమ్మం జిల్లాలో 16,616 ఎయిడ్స్ యాక్టివ్ కేసులు
- ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఆగని వ్యాప్తి

నేడు ప్రపంచ ఎయిడ్స్ డే

ఖమ్మంవైద్యవిభాగం : కొన్నేళ్లుగా ఎయిడ్స్ కోరలు చాస్తోంది. ఖమ్మం జిల్లాలో గత కొన్నేళ్లుగా పరిశీలిస్తే.. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ద్వారా నివారణ చర్యలు తీసుకుంటున్నా కేసుల తక్కువగా కనిపిస్తున్నా, వ్యాప్తి మాత్రం ఆగడం లేదు. ఫలితంగా మహమ్మారి బారిన పడి ప్రతీనెల పలువురు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు తగ్గడంతోనే వ్యాధి వ్యాప్తి చెందుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అధికారికంగానే ప్రతీనెల 40కి పైగా హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అనధికారికంగా చాలా మంది వ్యాధి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

ఏటా డిసెంబర్ 1న..

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టడం, వ్యాధి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబర్ 1న ఎయిడ్స్ డే జరుపుకుంటున్నారు. ఎయిడ్స్ మహమ్మారి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మరణిస్తుండటంతో ప్రజలకు అవగాహన కల్పించడానికి 1988 నుండి ప్రపంచ ఆరోగ్యసంస్థ వరల్డ్‌ఎయిడ్స్ డే నిర్వహిస్తోంది. జిల్లాలోనూ ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే, ఇవేమీ పెద్దగా సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో వ్యాధిని నియంత్రించలేకపోతున్నారు.

నిత్యం వెలుగు చూస్తున్న కేసులు

ఖమ్మం జిల్లాలో గత ఏడాది 16,307 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉండేవారు. కానీ ప్రస్తుతం ఆ సంఖ్య మరింత పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో 16,616 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా ఖమ్మం ఏఆర్‌టీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్న వారే. కానీ పేర్లు నమోదు చేసుకోకుండా ఉన్న వారిని కలిపితే సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఎయిడ్స్ బాధితుల్లో 6,576 మంది ప్రతీనెల క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారు. ఇందులో 2,667 మంది ఏఆర్‌టీ ఆసరా పెన్షన్ పొందుతున్నారు.

క్లుప్తంగా

ఆసుపాక పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత



పోలింగ్ కేంద్రం వద్ద ఇరువర్గాల వాగ్వాదం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక పోలింగ్ కేంద్రం వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ కేంద్రంలో ఓ ఓటరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా, అదే సమయంలో పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన ఏఎస్సై సెల్‌ఫోన్‌ను లాక్కొని చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడున్న కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆ దృశ్యాలను బీఆర్‌ఎస్ కార్యకర్త ఒకరు తన సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తుండగా, గమనించిన కాంగ్రెస్ కార్యకర్తలు అతనిపై దాడికి యత్నించారు. ఇరువర్గాల పరస్పరం గొడవపడటంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను అదుపు చేశారు.

ఓటర్లపై సీఐ ఆగ్రహం..!



125 నంబర్ బూత్ వద్ద పోలీసుల చేతిలో ధ్వంసమైన కుర్చీలు

మణుగూరు టౌన్: విప్పలసింగారంలో ఓటర్లు, పార్టీల నాయకుల తీరుపై మణుగూరు సీఐ రమాకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని విప్పలసింగారం పంచాయతీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో 200 మీటర్ల దూరంలో గుర్తులు చూపే విషయంలో ఇరుపార్టీల నాయకులకు వాగ్వాదం నెలకొంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. 105, 125 బూత్‌లలో గొడవను సద్దుమణిగించేందుకు ఓటర్లు, కాంగ్రెస్ నాయకులను చెదరగొట్టే క్రమంలో సీఐ రమాకాంత్, సిబ్బంది ఫర్నిచర్, కుర్చీలు ధ్వంసం చేశారు. ఓటర్లపై లాఠీ ఝులిపించారు. దీంతో కొందరు ఓటు వేయకుండానే 11 గంటల సమయంలో వెనుదిరిగారు. అనంతరం 2 గంటల తర్వాత నుంచి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

దమ్మపేట: కత్తితో చంపుతానని బెదిరించిన వ్యక్తులపై బుధవారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మందలపల్లి గ్రామం ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన షేక్ బుడే, షేక్ పాషా బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన అజీమ్ అనే వ్యక్తిని అసభ్య పదజాలంతో దూషించారు. కత్తితో చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. బుడే, పాషా ఓట్ల కోసం డబ్బులు పంపిణీ చేస్తున్నారని, పోలీసులకు అజీమ్ ఫిర్యాదు చేశాడనే అనుమానంతో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ, అజీమ్‌పై దాడికి ప్రయత్నించారు. బాధితుడు అజీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ముందుగానే క్లోజింగ్ బటన్ !

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని పల్లిపాడు పోలింగ్ కేంద్రంలో అధికారి పొరపాటుగా కంట్రోల్ యూనిట్ స్టార్ట్ బటన్‌కు బదులు క్లోజ్ బటన్ నొక్కాడు. దీంతో ఇంకా ఓటర్లు మిగిలి ఉండగానే కంట్రోల్ యూనిట్ ఫ్రీజ్ అయ్యింది. ఫలితంగా గంట పాటు పోలింగ్ నిలిచిపోగా, అధికారులు మరో కంట్రోలు యూనిట్ ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించారు.

ఏపీఓకు గుండెపోటు

కొణిజర్ల మండలం పెద్ద రాంపురం పోలింగ్ కేంద్రం ఏపీఓగా విధులకు వచ్చిన చంద్రశేఖర్‌కు గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనను గురువారం తెల్లవారుజామునే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది.

పోడు పట్టాలు ఇవ్వలేదని..

ఉదయం 10:30 గంటల వరకు ఓటేయని గ్రామస్తులు





లక్ష్మీదేవిపల్లి మండలంలో గిరిజనులకు నచ్చచెబుతున్న తహసీల్దార్, నల్లబండబోడు గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: పదేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న తమ భూములకు పోడు పట్టాలు ఇవ్వలేదంటూ లక్ష్మీదేవిపల్లి మండలంలోని లక్ష్మీపురం, పాత చింతకుంట, కొత్త చింతకుంట, గంగ్రబండం, ఆర్లగండి, పగడాయిగూడెం గిరిజన రైతులు ఎన్నికలను బహిష్కరించేందుకు యత్నించారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ జరగాల్సి ఉండగా, ఓటు వేయబోమంటూ ఆందోళనకు దిగారు. ఇక్కడి పోలింగ్ బూత్-92లో 1003 మంది ఓటర్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కె.రామకృష్ణ వరప్రసాద్, ఎస్ఐ సంతోష్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఫోన్‌ద్వారా కొత్తగూడెం ఆర్డీఓ శిరీష దృష్టికి తీసుకెళ్లగా, ఈ నెల 6న సమస్య పరిష్కరించేందు కృషి చేస్తామని ఆమె నచ్చజెప్పారు. దీంతో 10: 30 గంటల నుంచి ఓట్లు వేశారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ: తమకు పోడుపట్టాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదంటూ సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఆదివాసీలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్లు వేసేది లేదని కొన్ని గంటలపాటు భీష్మించారు. ఆ తర్వాత నాయకులు సర్దిచెప్పడంతో తిరిగి పోలింగ్‌లో పాల్గొన్నారు.

ఓటే వేసేది లేదు.. సరే వేస్తాం..

జూలూరుపాడు: మండలంలో గురువారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం ముగిసింది. ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన 36 పోలింగ్ స్టేషన్లలో మండలంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. నల్లబండబోడు గ్రామంలో 90 పోలింగ్ కేంద్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. అనంతారం నుంచి నల్లబండబోడు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పిస్తేనే ఓటు వేస్తామంటూ ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రాలేదు. దీంతో రెండు గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. తహసీల్దార్ శారద, వైరా ఏసీపీ సాంబరాజు బీటీ రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని, ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఓటర్లకు హామీ ఇవ్వడంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ 149 ఓటర్లకు గాను 145 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 97.3 శాతం పోలింగ్ నమోదయింది.

ఈ.బయ్యారంలో ఉద్రిక్తత

పోలీసుల లాఠీచార్జి, ఓ యువకుడి కాలు విరిగిన వైనం



రేగా కాంతారావు పోలింగ్ బూత్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న సీఆర్పీఎఫ్ బలగాలు



లాఠీచార్జీ సమయంలో కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్

పినపాక: మండల పరిధిలోని ఈ.బయ్యారం గ్రామ జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పోలింగ్ కేంద్రంలో పరిశీలించేందుకు వెళ్తుండగా సీఆర్పీఎఫ్ బలగాలు, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదని సీఆర్పీఎఫ్ జవాన్లు కాంతారావుతో వాదించారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. అయితే తాను ఎమ్మెల్యే అభ్యర్థినని, అన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించే అధికారం తనకు ఉందని సీఆర్పీఎఫ్ సిబ్బందితో రేగా వాదించారు. సమస్యను ఫోన్ ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. చివరకు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు రేగా కాంతారావు లోనికి అనుమతించారు. కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున నినాదాలు చేస్తుండగా పోలీసులు లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. ఈ క్రమంలో కల్లాకుల సతీష్ అనే యువకుడు ఫెన్సింగ్ దాటుతుండగా, ఫెన్సింగ్ పోల్ తగిలి కాలు విరిగింది. దీంతో స్థానికులు ఆటోలో అతనిని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా తనపై దాడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలపై, పోలింగ్ కేంద్రంలోని అనుమతించని సీఆర్పీఎఫ్ బలగాలపై కాంతారావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో రేగా కాంతారావు మాట్లాడుతూ కక్షతోనే తనపై దాడి చేశారని ఆరోపించారు. ఎస్పీతో మాట్లాడించినా సీఆర్పీఎఫ్ సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు తన వాహనంపై రాళ్లు వేసి ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని అన్నారు. తానే అత్యధిక మెజారిటీతో గెలుస్తానని, ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

మొరాయించిన ఈవీఎంలు



కొమ్ముగూడెం పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు బారులుదీరిన ఓటర్లు

పాల్వంచ: పాల్వంచ పట్టణ, మండల ప్రాంతాల్లో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో మున్సిపాలిటీలోని కొమ్ముగూడెం 50 నంబర్ పోలింగ్ బూత్‌లో ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఓటర్లు బారులుదీరారు. కొందరు వెనుదిరిగి వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ఓటు వేసేందుకు వచ్చారు. సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉండగా ఓటర్లు బారులు తీరడంతో అప్పటికప్పుడు స్థానికుల సాయంతో మున్సిపాలిటీ సిబ్బంది ఓటింగ్ కేంద్రం నందు విద్యుత్ లైట్లను అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. ఓటర్లు అధిక సంఖ్యలో ఉండటంతో కొందరిని గేటు లోపలి పంపించి గేటు వేశారు. కొందరు ఇంకా గేటు బయటే ఉండిపోవడంతో వారిని కూడా ఓటు వేయించాలని కోరగా అక్కడికి వచ్చిన డీఎస్పీ ఎ.కృష్ణయ్య అనుమతించలేదు. దీంతో స్థానికులు గంటల తరబడి నిరీక్షించారని, అక్కడి బూత్‌సిబ్బంది చీటీలు కూడా ఇచ్చారని వారికి కూడా ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ వినయ్‌కుమార్ అక్కడికి చేరుకుని ఆందోళన సద్దుమణిగించారు. అయితే సుమారు 10 మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. దంతెలబోర, నాగా రం కాలనీల్లో కూడా కొంత సేపు ఈవీఎంలు మొరాయించినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

సోములగూడెంలో..

నవభారత్: పాల్వంచ మండలంలోని సోములగూడెం గామపంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 24లో ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.



ఓటు వేయనీయకపోవడంతో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన స్థానికులు

బీఆర్‌ఎస్ నాయకుడి నుంచి నగదు స్వాధీనం

భద్రాచలంటౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఓటర్లకు పంచేందుకు తీసుకెళ్తున్న నగదును పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఓ బీఆర్‌ఎస్ నాయకుడు తీసుకెళ్తున్న రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

మద్యం సీజ్

దమ్మపేట: పోలీసులు, ఎఫ్ఎస్ టీ అధికారులు గురువారం మద్యం సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారంతో మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో ఓ ఇంట్లో ఎఫ్ఎస్‌టీం అధికారి కృష్ణ తనిఖీలు నిర్వహించి, అక్రమంగా నిల్వ చేసిన 69 మద్యం క్వార్టర్ సీసాలను గుర్తించారు. ఈ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామని ఎస్సై రవికుమార్ తెలిపారు.



సీజ్ చేసిన మద్యంతో అధికారులు

పెళ్లిబాజాలు మోగకుండానే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- పెళ్లి బట్టలు తెచ్చేందుకు వెళ్తూ అనంతలోకాలకు..



పసలాది రవీందర్ (ఫైల్)

తిరుమలాయపాలెం: త్వరలో ఆ ఇంట పెళ్లిబాజాలు మోగాల్సి ఉంది. దీంతో వరుడు పెళ్లి బట్టలు కొనుక్కునేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన పసలాది రవీందర్(24) మిషన్ భగీరథలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 7న తేదీన ఆయన వివాహానికి ముహూర్తం ఖరారు కావడంతో ఖమ్మంలో పెళ్లి బట్టలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటికి వచ్చే సమయాన కొన్ని బట్టలు షాపులోనే మర్చిపోవడంతో రవీందర్ తన స్నేహితుడు గణేశ్‌తో కలిసి బుధవారం రాత్రి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం భవానీ హోటల్ సమీపాన రహదారిపై ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో రవీందర్‌కు తీవ్రగాయాలు కాగా ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందగా గణేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారం రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు వెంకన్న – అలివేలమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, రవీందర్ మృతదేహం వద్ద ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

చెరువు ఖాళీ అవుతోంది..

అధికారులు స్పందించాలని రైతుల వినతి



చెరువు నుంచి భారీగా వెళ్తున్న నీరు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో రోజురోజుకు నీరు అడుగంటుతోంది. ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుమాధారం చెరువు షట్టర్లు కొన్నేళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో లీకేజీల ద్వారా నీరు దిగువన ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా దేవినేని వెంకటరమణ కెనాల్‌కు వెళ్తోంది. ఇదిలాగే కొనసాగితే మంగాపురం, చెరువుమాధారం, రాయగూడెం తదితర గ్రామాలకు తాగునీరే కాక ఆయకట్టులో సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా లీకేజీలను అరికట్టాలని చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధరావత్ రాధాకృష్ణమూర్తి కోరారు. అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు తన సతీమణితో, కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య తన భార్య, కుమారుడితో కలిసి వచ్చి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు పాత పాల్వంచలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిజలగం వెంకట్రావు దంపతులు లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో, సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విద్యానగర్‌లోని మాస్టర్ ఈకే విద్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కోయగూడెంలోని పోలింగ్ కేంద్రంలో, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అశ్వారావుపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు మండల పరిధిలోని నాయుడుపేట గ్రామ పోలింగ్ స్టేషన్‌లో ఓటువేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ గండుగులపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పినపాక బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మండలం సమితి సింగారంలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబసభ్యులతో కలసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పాల్వంచ: పాత పాల్వంచలో ఓటు వేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా దంపతులు



చుంచుపల్లి: విద్యానగర్ మాస్టర్ ఈకే పాఠశాలలో ఓటు వేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు



దమ్మపేట: గండుగులపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ



దమ్మపేట: నాయుడుపేటలో ఓటు వేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు



టేకులపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ



టేకులపల్లి : కోయగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య



కొత్తగూడెంరూరల్: ఓటు వేసిన జలగం వెంకట్రావు, ఆయన సతీమణి



బూర్గంపాడు: కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లిలో రేగా కాంతారావు కుటుంబీకులు..



బూర్గంపాడు: మణుగూరు మండలం సమితి సింగారంలో పాయం వెంకటేశ్వర్లు



భద్రాచలం ఓటింగ్ అనంతరం సతీమణి, కుమారుడితో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య



భద్రాచలం : ఓటింగ్ అనంతరం తన సతీమణితో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు

పీఎల్‌జీఏ వారోత్సవాలను జయప్రదం చేయండి

బీకే–ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: ఈనెల 2 నుంచి 8 వరకు జరిగే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం– అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడిని ఓడించాలని, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయాలని కోరారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉద్యమించాలని సూచించారు. ప్రజాపునాదిని పెంపొందించడం ద్వారా మావోయిస్టు పార్టీ పీపుల్స్ గెరిల్లా ఆర్మీ విప్లవ ప్రజానిర్మాణాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద, దళారీ, నిరంకుశ, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కోరారు.

తరలివచ్చి.. ఓటేసి!



రఘునాథపాలెం : బెంగళూరు నుంచి వచ్చి ఓటేసిన హరికిషన్



వైరా : టెక్సాస్ నుంచి వచ్చిన సీహెచ్.మాధవి



తల్లాడ : అమెరికా నుంచి వచ్చిన అన్నారుగూడెం వాసి ప్రత్యూష



ఖమ్మం రూరల్ : ఓటు వేసిన ఆనందంలో డాక్టర్ సంధ్య దంపతులు



వైరా : అబుదాబీ నుంచి వచ్చిన హరికృష్ణ

ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దేశంలోని వివిధప్రాంతాల్లో వారే కాకుండా విదేశాల్లో ఉన్న వారు సైతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. వారం, పదిరోజుల క్రితమే స్వస్థలాలకు చేరుకున్న వారు ఓటేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. రఘునాథపాలెం మండలంలోని హర్యాతండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎం.హరికిషన్ బెంగళూరు నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇక వైరాకు చెందిన సీహెచ్.మాధవి టెక్సాస్ నుంచి, హరికృష్ణ అబుదాబీ నుంచి వచ్చారు. అలాగే, బెంగళూరులో ఉంటున్న ఖమ్మం రూరల్ మండలం పెదతండాకు చెందిన డాక్టర్ పెరుమాళ్లపల్లి సంధ్య తన భర్త శరత్‌చంద్రతో కలిసి వచ్చి ఓటేశారు. ఇంకా తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన ప్రత్యూష కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్